క్లుప్తంగా

కోతుల పట్టివేత

దొనకొండ: దొనకొండలో చాలారోజుల నుంచి కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఎన్నో సార్లు పిల్లలను, వృద్ధులను కరిచాయి. ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సర్వసభ్య సమావేశం, పంచాయతీ సభ్యుల సమావేశంలో కోతుల సమస్య సభ్యులు లేవనెత్తగా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి కోతుల పట్టివేత కార్యక్రమం చేపట్టారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమరోలు: మండలంలోని అల్లినగరం సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసులు తెలిపారు. విద్యుత్ లైన్లలో మరమ్మతులు చేపడుతుండటంతో అల్లినగరం సబ్‌స్టేషన్ పరిధిలో అల్లినగరం, యర్రగుంట్ల, వట్టివేప మానుపల్లి, తాతిరెడ్డిపల్లి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఈఎస్‌ఐలో ఉద్యోగానికి ఎంపిక


ఖాదర్‌వలి

మార్కాపురం: ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ మంగళవారం విడుదల చేసిన ఉద్యోగ ఫలితాల్లో మార్కాపురం పట్టణానికి చెందిన ఖాదర్‌వలి ఎంటీఎస్ ఉద్యోగానికి ఎంపికైనట్లు శిక్షణ ఇచ్చిన మార్కాపురం ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్ సీనియర్ ఉద్యోగి కాశిరెడ్డి తెలిపారు. కేవలం ఏడాది వ్యవధిలో ఖాదర్‌వలి మూడు ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రిపరేషన్‌కు సలహాలు, సూచనలు ఇచ్చిన తారక్, శేషు, రమణారెడ్డి, గౌతమ్ తదితరులకు ఖాదర్‌వలి కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో లైన్‌మన్ మృతి

కొమరోలు: విద్యుత్ లైన్‌మన్ గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారు జామున జరిగింది. మండలంలోని సూరవారిపల్లె లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న శిఖామని (58) గుండెపోటుతో కొమరోలులోని తన నివాసంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది మృతదేహానికి నివాళులర్పించి ఆయన సేవలు కొనియాడారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి


గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కేపీ, నాయకులు, అధికారులు


దర్శి: గాంధీకి నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

- గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన ప్రముఖులు

మార్కాపురం టౌన్: గాంధీజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా మున్సిపాలిటీలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ, కోఆప్షన్ మెంబరు వనజాక్షి, నాయకులు సీహెచ్ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ బొగ్గరపు శేషయ్య, మారంరెడ్డి కిట్టు, మయూరి ఖాశీం, ఉత్తమ్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆదర్శ కపుల్స్ ఆధ్వర్యంలో జెడ్పీ బాలికోన్నత పాఠశాల, బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో గాంధీ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. విద్యార్థినులకు స్వచ్ఛభారత్ అంశంపై వక్తృత్వ పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ కోశాధికారి ఎస్ తులసి, ఆదర్శ కపుల్స్ పట్టణ అధ్యక్షుడు కె.రవికుమార్, నాయకులు జి.సురేష్ బాబు, నరేష్‌కుమార్ పాల్గొన్నారు. కమలా కాన్సెప్ట్ స్కూల్లో హెచ్‌ఎం పి.పుల్లయ్య ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అమ్మవారిశాల వద్ద గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు నివాళులర్పించారు. సంస్థ చైర్మన్ మువ్వల పార్థసారథి, అధ్యక్షుడు కల్లం సుబ్బారెడ్డి, డైరెక్టర్లు జీసీ సుబ్బారావు, జి.శ్రీనివాసులు, యక్కలి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్లలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. గొట్లగట్టు పీహెచ్‌సీ డాక్టర్ పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ నారాయణరెడ్డి, సీహెచ్‌ఓ, ఆవా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీకి బూచేపల్లి నివాళి

దర్శి: గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ హైస్కూల్లో గాంధీ విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి నందినీలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నేటి ప్రభుత్వం సాకారం చేస్తోందని చెప్పారు. అందులో భాగంగా నాడు నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి, వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా ఇంటికే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు మునగా లక్ష్మీకుమారి, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొత్తమాసు సాయి, వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు పెరుమాళ్ల మహేష్, ఆర్యవైశ్య మహిళలు పానుగంటి రజనీ, మునగా కుమారి, పరుచూరి కుమారి, ఒగ్గు లక్ష్మి పాల్గొన్నారు.

దర్శి: పట్టణంలో గాంధీ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దర్శనాపురి వాసవీ వనిత క్లబ్ ఆర్సీ మునగా ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆర్యవైశ్య మహిళలు మునగా నీలిమ, అధ్యక్షురాలు లక్ష్మీకుమారి, ప్రధాన కార్యదర్శి తెల్లం సావిత్రి, కోశాధికారి పరుచూరి దుర్గాకుమారి, ట్రెజరర్ లక్ష్మీ సుచరిత, కోల్లా సుజాత పాల్గొన్నారు.

గాంధీకి ఘన నివాళి

దొనకొండ: స్థానిక గ్రామ సచివాలయం-1లో మంగళవారం గాంధీ వర్ధంతిని సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారిలో పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి, సచివాలయం సిబ్బంది, వార్డు మెంబర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో పి.ఆంజనేయులు మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలు అందరికీ ఆదర్శంగా నిలవాలని, శాంతి-సహనం జీవన ప్రవాహంలో మనతో కలిసి జీవన ఔన్నత్యానికి దోహదపడతాయని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో ఉపాధ్యాయులు నందగోపాల్, జేమ్స్‌పాల్, జయచంద్ర, ఎం.శ్రీకాంత్, కోటేశ్వరరావు, మూర్తి, హనుమానాయక్ ఉన్నారు.


వై.పాలెం: గాంధీకి నివాళులర్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు


గాంధీకి నివాళులర్పిస్తున్న మహిళలు


మార్కాపురంలో విజేతలతో వాసవీ ఆదర్శ కపుల్స్ సభ్యులు


పొదిలిలో నివాళులర్పిస్తున్న సంస్థ నాయకులు


చినారికట్లలో గాంధీ చిత్ర పటానికి నివాళి

దర్శిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు కృషి

- రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

దర్శి: నియోజకవర్గ కేంద్రం దర్శిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు కృషి చేస్తామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డొంగరి రమేష్ అధ్యక్షతన జరిగిన రక్తదాన శిబిరాన్ని బూచేపల్లి వెంకాయమ్మ మంగళవారం ప్రారంభించారు. రక్తదాన శిబిరం ప్రారంభించి నిర్వాహకులు, రక్తదాతలను అభినందించారు. వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి నందినీలను ఘనంగా సత్కరించారు. వెంకాయమ్మ శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడేవారు, గర్భిణులు, ఇతర వ్యాధులతో అత్యవసర బ్లడ్ కోసం ఒంగోలు, చీమకుర్తి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అటువంటి వారికి ఉపయోగకరంగా ఉండేలా కలెక్టర్‌తో మాట్లాడి దర్శిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, కపురం శ్రీనివాసరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, సాగర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

చర్చికి బూచేపల్లి ఆర్థిక సాయం


పాస్టర్‌కు ఆర్థిక సాయంఅందజేస్తున్న డాక్టర్ శివప్రసాదరెడ్డి

కురిచేడు: మండలంలోని రామాంజనేయకాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన చర్చిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి ఇన్‌చార్జి డాక్టరు బూచేపల్లి శివప్రసాదరెడ్డి సోమవారం రాత్రి పరిశీలించారు. అగ్ని ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాస్టర్ ఎస్.అర్జున్ చందుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ పోతిరెడ్డి నాగిరెడ్డి, నాయకులు నారు శ్రీనివాసులరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, అంకె కృష్ణ, కొలూరి నరసింహులు, గోగులముడి లింగారెడ్డి, తెల్లమేకల వెంకటేశ్వర్లు, చిన్న పెద్దయ్య, బుల్లం వెంకట నర్సయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతపై డ్రైవర్లు దృష్టిపెట్టాలి

- ఆర్‌టీఓ అమర్‌నాయక్


డ్రైవర్లకు నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రసాద్

మార్కాపురం: డ్రైవర్లు ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆర్టీఓ అమర్‌నాయక్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌టీఓ కార్యాలయ ప్రాంగణంలో భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు వైద్య పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా ఆర్‌టీఓ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని హెచ్చరించారు. జిల్లా వైద్యశాలలోని కంటి వైద్య నిపుణులు ప్రసాద్ మాట్లాడుతూ.. కంటి చూపులో తేడా వచ్చిందని అనిపిస్తే వైద్యుడిని సంప్రదించి కళ్లజోడు వాడుకోవాలని సూచించారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ ఉండాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోవద్దని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభ వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా


మహిళల క్రికెట్ విజేత మార్కాపురం టౌన్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


ఎమ్మెల్యే నుంచి కప్ అందుకుంటున్న పోతలపాడు మహిళల కబడ్డీ జట్టు

- ముగిసిన నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్/తర్లుపాడు: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మార్కాపురం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల ముగింపు సభ మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో నైపుణ్యం ఉన్నప్పటికీ సరైన ప్రోత్సాహం లేకపోతే వెనుకబడే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలోనే ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహణకు బీజం పడిందన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు.

విజేతలు వీరే..

- నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. క్రికెట్ మహిళా విభాగంలో మార్కాపురం అరవింద ఘోష్ సచివాలయం, గొట్లగట్టు, తర్లుపాడు, పురుషుల విభాగంలో మీర్జపేట, పొదిలి-6, కొనకనమిట్ల సచివాలయం జట్లు వరుస మూడు స్థానాల్లో నిలిచాయి.
- బాల్ బ్యాడ్మింటన్‌లో పురుషుల విభాగంలో మార్కాపురం ఎస్‌సి బీసి కాలనీ, పొదిలి 2, కొనకనమిట్ల నాగంపల్లి సచివాలయం, మహిళల విభాగంలో మార్కాపురం జవహర్‌నగర్ కాలనీ-2, తర్లుపాడు, గొట్లగట్టు విజేతగా నిలిచాయి.
- వాలీబాల్ పురుషుల విభాగంలో పొదిలి 2, భూపతిపల్లి, తర్లుపాడు, మహిళల విభాగంలో తర్లుపాడు, తిప్పాయిపాలెం, ఉప్పలపాడు జట్లు సత్తా చాటాయి.
- కబడ్డీ పురుషుల విభాగంలో మార్కాపురం రాజీవ్‌నగర్ కాలనీ, పోతలపాడు, పొదిలి-3 జట్లు, మహిళల విభాగంలో తర్లుపాడు, భూపతిపల్లి, నాగంపల్లి జట్లు వరుస మూడు స్థానాల్లో నిలిచాయి.
- ఖోఖో పురుషుల విభాగంలో గొట్లగట్టు, తిప్పాయిపాలెం, తుమ్మలచెరువు, మహిళల విభాగంలో భూపతిపల్లి, గొట్లగట్టు, తుమ్మలచెరువు జట్లు సత్తా చాటాయి. బహుమతుల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కమిషనర్ రవీంద్ర, మార్కాపురం, తర్లుపాడు ఎంపీడీఓలు చందన, నరసింహులు, తర్లుపాడు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఈఓఆర్‌డీ బాలకృష్ణ, సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ పార్వతి రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు రామిరెడ్డి, కాశయ్య, గాయం శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు చాతరాజుపల్లి శ్రీనివాసులు, సూరెడ్డి రామసుబ్బారెడ్డి, దేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శేషయ్య, వీఆర్‌ఓ రంగయ్య, పంచాయితీ సెక్రటరీలు సుభాకర్, శ్రీనివాసులు, పాఠశాల హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, పీఈటీలు, వలంటీర్లు పాల్గొన్నారు.


మీర్జపేట క్రికెట్ టీంకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలి


రమణారెడ్డిపాలెంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఆర్‌ఓ

ముండ్లమూరు: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు, పోలింగ్ సిబ్బంది కనీస మౌలిక వసతుల కల్పనకు తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని ఈఆర్‌ఓ (ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్) లోకేశ్వరరావు అన్నారు. మండలంలోని చింతలపూడి, వేములబండ, రమణారెడ్డిపాలెం, కమ్మవారిపాలెం, వేముల, ఈదర, బొప్పూడివారిపాలెం, భీమవరం, నాయుడుపాలెం, ముండ్లమూరు, తూర్పుకంభంపాడు, సుంకరవారిపాలెం గ్రామాల్లో మంగళవారం పోలింగ్ కేంద్రాలను ఆయన ఎన్నికల సిబ్బందితో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరా, ర్యాంపు, తాగునీరు, రాకపోకలకు అనువుగా ఆ ప్రాంతం ఉందా లేదా చూడాలన్నారు. ఎక్కడైనా వసతులు లోపిస్తే వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు ఉన్నారు.

బ్రిడ్జి గోడను ఢీకొట్టిన కారు

కొమరోలు: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఓ కారు బ్రిడ్జి గోడను ఢీకొట్టింది. ఈ సంఘటన మండలంలోని గుండ్రెడ్డిపల్లె సమీపంలో మంగళవారం జరిగింది. గిద్దలూరు నుంచి మార్కాపురం వైపుగా వెళ్తున్న కారు గుండ్రెడ్డిపల్లె గ్రామ సమీపంలోకి రాగానే రాంగ్ రూటులో వాహనం రావడంతో ఆ వాహనాన్ని తప్పించే క్రమంలో కారు బ్రిడ్జి గోడను ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం దెబ్బతింది.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈవో ఆంజనేయులు

యర్రగొండపాలెం: ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని డీసీఈబీ వారు విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారని ఎంఈవో పి.ఆంజనేయులు తెలిపారు. ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో సిలబస్ పూర్తి చేసి తగువిధంగా మార్గదర్శకాలు చేసినా ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. జరగబోయే 45 రోజులు ఒక ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలను రాబట్టవచ్చని ఆయన ఆకాభావం వ్యక్తం చేశారు. స్టడీ మెటీరియల్‌ను ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు ఆయన అందజేశారు.

వై.పాలెం సీఐగా రాములు నాయక్


రాములు నాయక్

యర్రగొండపాలెం: వై.పాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.రాములు నాయక్‌ను నియమిస్తూ మంగళవారం గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కె.మారుతీకృష్ణను రేంజ్ వీఆర్‌కు పంపారు. రేంజ్ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న రాములు నాయక్‌ను యర్రగొండపాలెం సర్కిల్‌కు బదిలీ చేశారు.

వేలానికి ప్రభుత్వ వాహనం

దర్శి: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి దర్శి కార్యాలయానికి చెందిన ప్రభుత్వ వాహనం వేలం వేస్తున్నట్లు పీఆర్‌వో దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ 27బీ2021 నంబరు గల 27 సంవత్సరాల జీపును ఎంవీఐ ద్వారా రూ.30 వేల విలువతో ధ్రువీకరించినట్లు తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీన వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపారు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బేస్తవారిపేట: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కంభం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పాన్‌పరాగ్, మత్తుపదార్థాలు, జంక్ ఫుడ్స్, కూల్‌డ్రింక్స్, పొగాకు ఉత్పత్తులు వాడటంతో క్యాన్సర్ బారిన పడతారని చెప్పారు. చిన్న వయసులో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తి జీవితం అంధకారం అవుతుందని వివరించారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. హెచ్‌ఎం ఎంఎస్ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెటిల్‌మెంట్ భూమి 10,562 ఎకరాలు

బేస్తవారిపేట: మండలంలోని 19 పంచాయతీల్లో 2003కు ముందు అసైన్‌మెంట్ భూమి పట్టాలు పొందిన వారు, చుక్కల భూములకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తహసీల్దార్ డీవీబీ వరకుమార్ తెలిపారు. మండలంలో 5243 సర్వే నంబర్లను, 10562 ఎకరాల భూమిని ఫ్రీ హోల్డ్ ఆఫ్ అసైన్‌మెంట్ మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు పట్టాదారులు, వారి వారసుల ఆధీనంలో ఉన్న, సాగు చేసుకుంటున్న లబ్ధిదారుల భూములను సెటిల్‌మెంట్ భూములుగా మార్చనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వేలాదిమంది రైతులకు మేలు జరుగుతుందన్నారు.

వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ నేడు

తాళ్లూరు (ముండ్లమూరు): వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా బుధవారం మహిళలకు ఆరు కోట్ల ఆరు లక్షల వైఎస్సార్ ఆసరా రుణమాఫీ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దర్శి వైఎస్సార్ సీపీ కార్యాలయ ఇన్‌చార్జి సందిరెడ్డి నరేంద్రరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక హైస్కూల్ ఆవరణలో ఉదయం పది గంటలకు జరిగే చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మండలంలోని 810 సంఘాలకుగాను ఆరు కోట్ల ఆరు లక్షల చెక్కును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు హాజరవుతున్నారని తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: మండలంలోని గ్రామాల్లోని ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రజల సమస్యలు పరిష్కరించేలా కృషి చేద్దామన్నారు. ఎంపీడీఓ హేమలత, మాజీ ఎంపీపీ కడప వంశీధర రెడ్డి, కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిద్దలూరు చిన్నారుల ప్రతిభ

గిద్దలూరు రూరల్: యూత్ స్పోర్ట్స్ రిక్రియేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో గిద్దలూరుకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా వారిని స్థానిక క్లబ్ ఆవరణలో అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మొత్తం 1073 మంది పాల్గొనగా అందులో అత్యుత్తమ ప్రతిభకనభరిచిన వారు 50 మంది కాగా వారిలో గిద్దలూరుకు చెందిన భావనదేవి, సనాకౌసర్, యశోదాదేవి, చంద్రమౌళి, నాగ్, సొహేల్, కుర్షిద్ ఉన్నారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా లాన్ టెన్నిస్ కోర్టు అధ్యక్షుడు డాక్టర్ జీకే మోహన్‌రెడ్డి, గిద్దలూరు టెన్నిస్ కోర్టు అధ్యక్షుడు డాక్టర్ రంగారెడ్డి, కోచ్ మురళి, విశ్వభారతి స్కూల్ కరస్పాండెట్ రంగస్వామిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక ప్రజావేదిక

పెద్దారవీడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి 14వ విడత సామాజిక ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో 1.4.22 నుంచి 31.3.23 వరకు చేపట్టిన పనులపై ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.